## క్లుప్తంగా

### పాఠశాలను సందర్శించిన ఎంపీడీవో



నెల్లిపూడి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మణరావు

**గంగవరం :** ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం మధ్యాహ్న భోజన పథకాన్ని మెనూ ప్రకారం నిర్వహించాలని ఎంపీడీవో వై.లక్ష్మణరావు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సూచించారు. మండలంలోని నెల్లిపూడి గ్రామంలో ఆయన గురువారం పర్యటించారు. ఇందులో భాగంగా నెల్లిపూడి మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలల్లో పిల్లల హాజరు, సమస్యలను ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించారు.

### పోషకాహారంతోనే ఆరోగ్యం



బాలింతకు పౌష్టికాహారం అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

**అనంతగిరి (అరకులోయటౌన్):** మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న గర్భిణీలు, బాలింతలకు గురువారం మాతృభూమి సేవా సంఘం ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందించారు. ఈ సందర్భంగా మాతృభూమి సేవా సంఘం సభ్యులు స్వామి, గోపి, కిరణ్, రమేష్, ఉదయ్ కుమార్ మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు మంచి పౌష్టికాహారం అందించాలన్న సంకల్పంతో ప్రతీ నెలలో ఒక రోజు పీహెచ్‌సీలో వైద్య పొందుతున్న బాలింతలు, గర్భిణులను భోజన సదుపాయం కల్పిస్తున్నామన్నారు. ఇటువంటి సేవ కార్యక్రమాలు చేయడం చాలా ఆనందంగా ఉందని, ఈ సేవలు మరింత విస్తృత పర్చడానికి ప్రతీ ఒక్కరి సహాయ సహకారాలు అవసరమన్నారు. గిరిజన ప్రాంతంలో తమ సంఘం చేపడుతున్న ప్రజాహిత కార్యక్రమాల్లో యువత స్వచ్ఛందంగా పాల్గొని పాలు పంచుకోవాలని కోరారు.

### క్రీడా పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ భరత్ కుమార్ నాయక్

**అరకులోయటౌన్:** స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. విద్యార్థిని, విద్యార్థులకు వేర్వేరుగా క్రీడా పోటీలు నిర్వహిస్తామని, విజేతలకు ఆగస్టు 15న బహుమతులు, ధ్రువ పత్రాలు అందజేస్తామని స్పోర్ట్స్ ఇన్‌చార్జి పి.నాగబాబు తెలిపారు. కళాశాల పీడీ ఎస్.అప్పారావు పర్యవేక్షణలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. ఎన్ఎస్ఎస్ పీవోలు వై.విజయలక్ష్మీ, ఎం.అనిత కుమారి, వైస్. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కొండబాబు, అధ్యాపకులు గణేష్, బి.లచ్చన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

### పాఠశాలల్లో రాఖీ పండగ



రాఖీలు కడుతున్న చిన్నారులు

**గంగవరం :** మండలంలో వివిధ పాఠశాలల్లో రాఖీ పండగను పురస్కరించుకొని బాలబాలికలచే రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. గురువారం మండలంలో పలు పాఠశాలలో రాఖీ పండగ నిర్వహించి అన్నాచెల్లెలు, అక్కతమ్ముళ్ల అనుబంధాన్ని విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. ఈ సందర్భంగా బాలబాలికలు రాఖీలు కట్టుకున్నారు. శుక్ర, శనివారాలు సెలువుల కారణంగా గురువారమే వివిధ పాఠశాలలో రాఖీని నిర్వహించారు.

### ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



బాలింతలకు సూచనలిస్తున్న వైద్యాధికారి రుక్మిణి

**చింతపల్లి:** బాలింతలు పసిబిడ్డలు పట్ల అత్యంత జాగ్రత్తలు పాటించాలని చింతపల్లి ఏరియా ఆస్పత్రి వైద్యాధికారి రుక్మిణి అన్నారు. తల్లి వారోత్సవాలు ముగింపు సందర్భంగా బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పుట్టినప్పటి నుంచి పసి బిడ్డలకు ఏ విధంగా పాలు పట్టించాలి, ఎన్నిసార్లు పాలివ్వాలనే అంశాలతో పాటు పలు జాగ్రత్తలను వివరించారు. ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

# పనులు పూర్తయ్యేదెన్నడో?

- నత్తనడకన మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్ రహదారి నిర్మాణం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో శరవేగంగా పనులు
- బోసుబెడ గ్రామంలో అసంపూర్తిగా నిర్మించిన మురుగుకాలువ
- ప్రమాదాల బారిన పశువులు, వృద్ధులు, చిన్నారులు
- త్వరితగతిన పనులు పూర్తి చేయాలంటున్న గిరిజనులు



మాడగడ వ్యూపాయింట్ వద్ద అసంపూర్తిగా రహదారి



బోసుబెడలో డ్రైనేజీ దుస్థితి

**అరకులోయటౌన్:** ప్రముఖ పర్యాటక కేంద్రం, ఆంధ్రా ఊటీ అరకులోయ మండలం మాడగడ సన్‌రైజ్ వ్యూ పాయింట్ రహదారి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాటి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఏజెన్సీలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేశారు. ఇందులో భాగంగా అరకులోయ మండలం, బోసుబెడ గ్రామం నుంచి మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్ వరకు 3.75 కిలోమీటర్లు డబుల్ రోడ్డు, రిటైనింగ్ వాల్స్, మరుగుకాలువల నిర్మాణానికి రూ. 13 కోట్లు నిధులు మంజూరు చేసింది. నిర్మాణ పనులు అప్పట్లో శరవేగంగా జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా పనుల్లో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తుంది. బీటీ రోడ్డు, రిటైనింగ్ వాల్స్ పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్ సీసీ రోడ్డు, మరుగు కాలువల నిర్మాణంలో జాప్యం జరుగుతుందని స్థానిక గిరిజనులు చెబుతున్నారు.

**అసంపూర్తిగా డ్రైనేజి**

బోసుబెడ గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా సీసీ డ్రైనేజీ నిర్మించాల్సి ఉండగా ఒక వైపు మాత్రమే నిర్మించి, పైకప్పు నిర్మించకుండా విడిచి పెట్టారు. దీంతో పశువులు, వృద్ధులు, చిన్నారులు కాలువలో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. సీసీ డ్రైనేజీ వెంటనే పైకప్పు నిర్మించి, రెండో వైపు కూడ సీసీ డ్రైన్ నిర్మించాలని గ్రామ గిరిజనులు కోరుతున్నారు.



బోసుబెడ - మాడగడ వంతెన వద్ద కోతకు గురైన రహదారి

**వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిధుల కేటాయింపు**

మండలంలోని బోసుబెడ గ్రామం నుంచి మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్ వరకు డబుల్ రోడ్డు, రిటైనింగ్ వాల్స్, సీసీ డ్రైనేజీల నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 13కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ ప్రాంతానికి దేశ, విదేశాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలిరావడంతో అప్పటి నుండి ఈ వ్యూ పాయింట్‌కు పర్యాటకుల తాకిడి విపరీతంగా పెరిగింది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, జీపులు, కార్లు, మినీ బస్సులు, బస్సులలో అధిక సంఖ్యలో వ్యూపాయింట్‌కు పర్యాటకులు తరలిరావడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడేది. వ్యూ పాయింట్‌కు వెళ్లేందుకు శిథిలమైన రహదారి ఉండేది. సరైన రహదారి సౌకర్యం లేదని, డబుల్ రోడ్డు, మురుగు కాలువలు, రిటైనింగ్ వాల్స్ నిర్మిణాం కోసం అప్పటి అరకులో మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అప్పటి పర్యాటక శాఖ మంత్రి రోజా దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. స్పందించిన మంత్రి రోజా నిధులు మంజూరు చేయడంతో వెంటనే పనులు ప్రారంభించారు. ప్రస్తుతం సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

### డ్రైనేజీ పైకప్పు నిర్మించాలి



మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్ రహదారి నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ బోసుబెడ గ్రామంలో మురుగు కాలువ మా ఇంటి పక్కన నిర్మించి పై కప్పు వేయలేదు. దీంతో పశువులు, వృద్ధులు, చిన్నారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రిళ్లు మరింత ఇబ్బంది పడుతున్నాం. వెంటనే మురుగు కాలువపై పైకప్పు నిర్మించాలి.

– పదాల విశ్వనాథ్, గిరిజనుడు, బోసుబెడ, అరకులోయ

### చర్యలు తీసుకుంటాం



మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్ రహదారి నిర్మాణం పనులు ప్రస్తుతం జరుగుతుంది. మాడగడ బ్రిడ్జి వద్ద సీసీ రోడ్డు, వ్యూపాయింట్ వద్ద బీటి రోడ్డు నిర్మించాల్సి ఉంది. గత కొన్ని నెలల క్రితం ప్రభుత్వం బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా నిర్మాణ పనులు సాగలేదు. బోసుబెడ గ్రామంలో నిర్మించిన మురుగుకాలువపై పైకప్పు వెంటనే వేయాలని, ఇతర పనులు శరవేగంగా నిర్మాణాలు జరపాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించాను.

– రాముమ్, డీఈఈ, పీఆర్ ఇంజినీరింగ్, అరకులోయ

## బినామీ వ్యవస్థను అరికట్టాలి



తహసీల్దార్‌తో చర్చిస్తున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

**అరకులోయటౌన్:** నియోజకవర్గ కేంద్రమైన అరకులోయలో బినామీ వ్యవస్థను అరికట్టాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. శరభగుడలోని తన నివాసంలో తహసీల్దార్ వెంకట అప్పారావుతో ఎమ్మెల్యే మత్స్యలింగం గురువారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడారు. అరకులోయ కేంద్రంలో బినామీ వ్యవస్థ పెరిగిపోతోందని, గిరిజనేతరులకు కొంతమంది గిరిజన పెద్దలు బినామీలుగా వ్యవహరించి, గిరిజనులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నారన్నారు. బినామీ వ్యవస్థ జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా ప్రతిష్ట చర్యలు చేపట్టాలన్నారు. మండలంలోని ప్రజలకు రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉంటూ రెవెన్యూ సేవలు సంపూర్ణంగా అందించేందుకు రెవెన్యూ అధికారులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ గోవింద్ పాల్గొన్నారు.

## బాబూరావు మృతి పార్టీకి తీరని లోటు

**పెదబయలు:** మండలంలోని బొంగరం పంచాయతీ వైస్ సర్పంచ్ బూడిదే బాబురావు(30) హఠార్మరణం పార్టీకి తీరనిలోటని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తనయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు రేగం చాణక్య అన్నారు. బాబూరావు మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని ఆయన పార్టీ నాయకులతో కలిసి బొంగరం పంచాయతీ వంచుర్బ గ్రామానికి గురువారం వచ్చారు. బాబూరావు పార్థీవదేమానికి పూలమాలుల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను కలసి పరామర్శించి, ధైర్యం చెప్పారు. చిన్న వయస్సులోనే పంచాయతీలో ఉప సర్పంచ్ పదవి చేపట్టారని, వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని బాబూరావు సేవలను ఆయన కొనియాడారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు మజ్జి చంద్రుబాబు, నాయకులు పాంగి విజయ్, కాపు మాధవరావు, నాయకులు సాగేని నాగరావు, సందడి కొండబాబు, చిట్టిబాబు, అప్పన్న, రామన్న, శ్రీను, ప్రసాద్‌నాయుడు, నాగం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పశువైద్య శిబిరాలు



జీవానికి చికిత్స చేస్తున్న పశువైద్యుడు

**కొయ్యూరు:** మండలంలోని ఎం.మాకవరం, గింజర్తి, చింతలపూడిలో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో నాబార్డు మాతోట–రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగింది. పశు వైద్యుడు కె.రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో పశువులకు మేకులు, గొర్రెలు, కోళ్లకు చికిత్స చేశారు.రైతులకు మందులు అందజేశారు. పశువ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయా శిబిరాల్లో సుమారు 400 పశువులకు చికిత్స చేశారు. పాడిరైతులు స్వచ్ఛంద సంస్థ సేవలపై హర్షం వ్యక్తం చేశారు. ప్రోగ్రాం అధికారి హరికృష్ణ పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



ముంచంగిపుట్టులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్, అంగన్‌వాడీ సిబ్బంది



జి.మాడుగులలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో వీరభద్రరావు

**ముంచంగిపుట్టు:** తల్లిపాలు వారోత్సవాలు ముగింపు సందర్భంగా మండలంలోని సీడీపీవో రాజేశ్వరి ఆధ్వర్యంలో గురువారం సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు పెట్టడం వలన వ్యాధి నిరోధక శక్తి పెంచుతుందని, ఆరు నెలలు వరకు కేవలం తల్లిపాలే పెట్టలాని, అప్పుడే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. బాలింతలు, గర్భిణులకు తల్లిపాలు యొక్క ప్రాముఖ్యతను వివరించారు. వెలుగు ఏపీఎం కళావతి, సూపర్‌వైజర్లు కొండమ్మ, వరహాలమ్మ, స్వర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**జి.మాడుగుల:** మండల కేంద్రంలోని జరిగి కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో, ఏవో వీరభద్రరావు, సీడీపీవో బాలదేవి మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఆరోగ్య సూచనలు ఆచరించాలన్నారు. తల్లిపాలు పట్టినప్పుడు ప్రశాంతంగా ఉండాలని లేదంటే బిడ్డకు ఊపిరి ఆడక తీవ్ర అస్వస్థకు గురయ్యే ప్రమాదముందన్నారు. తల్లిపాలు తప్పితే డబ్బా, ప్యాకెట్ పాలు పట్టవద్దని వారు సూచించారు. సీడ్ ఎన్‌జీవో రాజు, హెచ్‌వీ రత్నం, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

**చింతపల్లి;** పుట్టిన బిడ్డలకు తల్లి మురిపాలతోనే శ్రేయస్కర ఆరోగ్యం పొందవచ్చునని సీడీపీవో శ్రీదేవి అన్నారు.గురువారం చింతపల్లిలో ప్రపంచ తల్లి పాలవారోత్సవాలు ముగింపు సందర్భంగా ప్రాజెక్టు పరిధిలో అవగాహన ర్యాలీ చేపట్టారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి తల్లి పుట్టిన బిడ్డకు వెంటనే మురిపాలు పట్టించడం బిడ్డలు ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నారు.కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సీమంతాలు, బాలింతలకు పౌష్టికాహారం,పసి బిడ్డలకు అన్న ప్రశాన కార్యక్రమాలను చేపట్టారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జయభారతి,సౌజన్య.తులసి,లక్ష్మి,గౌరితో పాటు అంగన్‌వాడి కార్యకర్తలు,ఆయాలు పాల్గొన్నారు.

**చింతూరు:** పుట్టిన బిడ్డలకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని చింతూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్, వైద్యశాఖ ఆధ్వర్యంలో గురువారం చింతూరులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రెండు శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజల్లో అవగాహక కల్పించాలని సూచించారు. సీడీపీవో జయలక్ష్మి మాట్లాడుతూ బాటిల్ పాల కారణంగా అనేక అనర్థాలు కలిగి పిల్లలకు వ్యాధులు వచ్చే అవకాశముందని, స్థానికంగా లభించే ఆహార ధాన్యాలను పిల్లలకు పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్య నిపుణుడు మహేష్, ఐసీడీఎస్, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



చింతపల్లిలో ర్యాలీ చేస్తున్న సీడీపీవో శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు



చింతూరులో మాట్లాడుతున్న సీడీపీవో జయలక్ష్మి

## ఉపాధి పనులు వేగవంతం



మాట్లాడుతున్న ఎంపీడీవో సీతామహాలక్ష్మి

**చింతపల్లి:** మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్, టీఏలతో ఉపాధి పనులపై ఎంపీడీవో సీతామహాలక్ష్మి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఉపాధి పనులపై సిబ్బందికి ఒక్క రోజు వర్క్‌షాపు నిర్వహించారు. గ్రామాల్లో మంజూరైన పనులతో పాటు జాబ్ కార్డు దారులను గుర్తించి, వారికి బ్యాంకు అకౌంట్‌లను ప్రారంభించి క్రమం తప్పక పనులు చేపట్టాలన్నారు. ప్రతి వారం చేస్తున్న పనులను వెంటనే రికార్డు చేసి జనరేట్ చేయాలన్నారు. జాబ్ కార్డుదారులకు సక్రమంగా వేతనాలు అందే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.చింతపల్లి ఏపీవో రాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టీఏలు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదివాసీ చట్టాలను పరిరక్షించుకోవాలి

**ఎటపాక:** ఆదివాసీలంతా ఏజెన్సీ చట్టాలు, హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను పిలుపునిచ్చారు. నవోత్సవాల్లో భాగంగా లక్ష్మీపురం గ్రామంలో చైతన్య సదస్సు గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు అతీతంగా ఆదివాసీలు చట్టాలు,హక్కుల అమలుకు ఉద్యమించాలన్నారు. ఆదివాసీ హక్కులను పరిరక్షించుకోవాలన్నారు. కృష్ణ, జంపన్న, రమేష్, సురేష్ తదితరులున్నారు.

## ఆదివాసీ దినోత్సవానికి ఏర్పాట్లు

**గంగవరం :** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఈనెల 9న మండల స్థాయిలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆదివాసీ దినోత్సవ నిర్వహణ కమిటీ ప్రతినిధులు కె.సిద్దూ, కె.రాంబాబు గురువారం ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి వివిధ కార్యక్రమాలు జరుగుతాయని మండల స్థాయిలో గల ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, పీసా గ్రామ కమిటీ సభ్యులు, ఆదివాసీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, యువకులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## గుత్తులపుట్టును మండల కేంద్రంగా ప్రకటించాలి



గుత్తులపుట్టు సంతబయలు వారపు సంతలో ప్ల కార్డులతో నిరసన చేస్తు రాస్తారోకో చేస్తున్న గిరిజనులు

**పాడేరు రూరల్:** గుత్తులపుట్టుని మండల కేంద్రంగా ప్రకటించాలని మండల సాధన కమిటీ అధ్యక్షుడు సూరిబాబు డిమాండ్ చేశారు, గుత్తులపుట్టు సంతబయలు వారపు సంతలో వివిధ పంచాయతీల గిరిజనులతో ప్లకార్డులు ప్రదర్శించి రాస్తారోకో చేశారు, అనంతరం ఆయన మాట్లాడుతూ పాడేరు, హుకుంపేట, పెదబయలు మండలాల పరిధిలో ఉన్న 16 గ్రామ పంచాయతీలతో గుత్తులపుట్టులో మండల కేంద్రంగా ప్రకటించాలన్నారు. పాడేరు తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు గుత్తులపుట్టు కేంద్రంగా అనుకూలమన్నారు. రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం నూతన మండల కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు, ఆదివాసీ ట్రస్ట్ చైర్మన్ పడాల్, నాయకులు మహేష్, ఆనంద్, వీరన్న, చంటి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

**మండల కేంద్రం ప్రకటనపై హర్షం**

రంపచోడవరం: వై రామవరం మండలాన్ని రెండు మండలాలుగా విభజించేందుకు కేబినెట్ ఆమోదం తెలపడంపై రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. వై.రామవరం మండలం అప్పర్ పార్ట్ గిరిజనులు మండల కేంద్రం చేరుకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారని, కొత్త మండలం ఏర్పాటుతో గిరిజనులకు కష్టాలు తప్పుతాయన్నారు. కొత్త మండలం ఏర్పాటుతో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న గిరిజనుల కల నేరవేరుతుందన్నారు.

## సచివాలయ ఉద్యోగులకు సన్మానం



సచివాలయ ఉద్యోగులను సన్మానించిన సర్పంచ్, ఎంపీటీసీ స్థానికులు

**గూడెంకొత్తవీధి:** లక్కవరపుపేట సచివాలయ ఉద్యోగులను స్థానికులు గురువారం ఘనంగా సన్మానించారు. ఆయా ఉద్యోగులందరూ బదిలీ కావడంతో ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించార. సర్పంచ్ కంకిపాటి వీరేంద్ర ప్రసాద్, ఎంపీటీసీ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ రామారావు పాల్గొన్నారు.సచివాలయ వ్యవస్థ వచ్చిన నాటి నుంచి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారని వారంతా సచివాలయ సిబ్బంది సేవలను కొనియాడారు. బదిలీపై వెళ్తున్న వారు మాట్లాడుతూ సహచర ఉద్యోగుల ఎంతో అభిమానాన్ని పొందడం చాలా ఆనందంగా ఉందన్నారు.

## గ్రామాల్లో తాగునీటి కష్టాలు తీర్చాలి



మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు రాంబాబు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ

**పాడేరు రూరల్:** గ్రామాల్లో తాగునీటి కష్టాలు తీర్చేదెప్పుడోనని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు తెలిపారు. పార్టీ శ్రేణులతో కలిసి ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. మండలంలో 26 గ్రామ పంచాయతీల పరిధిలో తాగునీరు సమస్య ఎక్కువగా ఉందన్నారు. వర్షాకాలంలోనే వేసవిల తలపిస్తు తాగునీరు కష్టాలు తీవ్రతరం అవుతుందన్నారు, ప్రజల సౌకార్యర్థంగా గ్రామలో ఏర్పాటు చేసిన జల్‌జీవన్ మిషన్, గ్రావేటి తాగునీటి పథకాలు నిరుపయోగంగా మారాయన్నారు, దీనికి తోడు అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేక పథకలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారిందన్నారు. కొన్నిచోట్ల పైపులైన్, తాగునీటి ట్యాంకులు నిరుపయోగంగా మారాయని, కనీసం వాటిపై అధికారులు దృష్టి సారించడం లేదన్నారు. దీంతో అధికారుల నిర్లక్ష్యం గ్రామస్తులకు శాపంగా మారిందన్నారు. గ్రామాల్లో తాగునీటి సదుపాయం లేక గత్యంతరం లేక గిరిజనులు ఊట గెడ్డలను ఆశ్రయించి కలుషితమైన నీటిని వినియోగించి వ్యాధులు బారిన పడుతున్నరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. లేనిపక్షంలో గిరిజనులతో కలిసి సంబంధిత కార్యాలయాల ముట్టడి కార్యక్రమాలు నిర్వహించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు సన్యాసిరావు, సర్పంచ్ రాంబాబు, మండల ఉపాధ్యక్షులు బసవన్నదొర, నాయకులు లింగమూర్తి, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## యూటీఎఫ్ సభ్యత్వ నమోదు ప్రారంభం



పనసపుట్టులో యూటీఎఫ్ సభ్యత్వం నమోదు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

**ముంచంగిపుట్టు:** యూటీఎఫ్‌లో సభ్యులుగా చేరాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందామని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మొఖ్యా ధర్మారావు అన్నారు. మండలంలో గల జోలాపుట్టు, లబ్బూరు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ, ఉన్నత పాఠశాలల్లో యూటీఎఫ్ సభ్యత్వం నమోదు కార్యక్రమం గురువారం నిర్వహించారు. సభ్యత్వం నమోదు చేసి, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మొఖ్యా ధర్మారావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు యూటీఎఫ్‌లో ఎక్కువమంది సభ్యులుగా చేరాలన్నారు. నిరంతరం ఉపాధ్యాయుల హక్కులపై యూటీఎఫ్ అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సమరెడ్డి రాజు, కార్యదర్శి గోపి, ఆడిట్ కమిటీ సభ్యులు గాసన్న తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీలో శాంతి భద్రతలకు విఘాతం



పండా రామకృష్ణదొర

**రంపచోడవరం:** ఏజెన్సీలో ఎన్నడూ లేని విధంగా శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ కన్వీనర్ పండా రామకృష్ణదొర ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సామాన్యుల నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు, ముఖ్యంగా మహిళలకు రక్షణ కరువైయిందన్నారు. దేవీపట్నం మండలం శరభవరం సచివాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగిని ఆమె కార్యాలయానికి వెళ్లి ఈడ్చుకుని వెళ్లి కిడ్నాప్ చేసిన ఘటన రాష్ట్రంలో పరిస్థితులకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి తక్కువ, అరెస్టులు ఎక్కువగా ప్రభుత్వం నడుస్తుందన్నారు. కూటమి పాలనను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలో తగిన బుద్ధి చెబుతారన్నారు.